బస్టాండ్ జనసముద్రంలా వుంది.

సముద్ర మధ్యంలో ద్వీపంలో వుంది-ఒక్కతే-రుక్మిణి.

ఆమె సెమినార్‌లో పాల్గొనాలని వచ్చిందక్కడికి. మూడు రోజులూ మూడు యుగాల్లాగే గడిచిపోయాయి. అఖిల భారత స్థాయిలో ఒక్కో ప్రాంతానికి ఒకరిద్దరుగా ఎన్నిక చేసిన గృహిణుల సెమినార్ అది.



# రసలోలిత

యామినీ సరస్వతి

ఆ జిల్లా కలెక్టర్ కొత్తగా రిక్రూట్ అయి వచ్చింది.

ఆమె జీవిత చెలికాడూ కలెక్టరే.

వాళ్ల దాంపత్యం పున్నమి వెన్నెల్లు పరిమళించే పారిజాతంలా వుంది కాబోలు - అందుకే గృహిణుల సెమినార్ ఏర్పాటుచేసింది. ఉద్యోగినులు, వ్యాపారులు, పల్లెపడుచులు... రకరకాల జీవన స్థాయిలో వున్న భార్యలని ఓ కప్పు క్రిందికి చేర్చింది ఆమె.

చర్చ-ఈనాటి సాంఘిక వ్యవస్థలో దృఢపడవలసిన భార్యాభర్తల సహృదయ సంబంధాలు...

ఇక్కడికి రుక్మిణి రావడమే విశేషం.

ఆవూరి ఛేర్మన్ గారి భార్య ఈ లేడీ కలెక్టరుగారికి బాగా పరిచయం. ఆమె రుక్మిణి పేరు సూచించింది.

ముందు రుక్మిణి యిష్టపడలేదు.

పరమశివానికీ యివంటే బొత్తిగా యిష్టం లేదు.

అప్పుడే పూచిన మావిరెమ్మపై వాలి కొసరి కొసరి కుహూ కుహూ నినాదాలు పలికే కోకిల్లాగా, తొలిసారిగా పూసి తలెత్తి లోకాన్ని పాలిస్తోన్నంత గర్వంగా చూసే కేతకిలా, శ్రావణ మేఘమాలికల కదలికకే కదలిపోయి నర్తించే కేకిలా వుండే రుక్మిణి-తన స్వంతం.

తానై మూడుముళ్లూ బిగించి తనకోసం తన యింటికి తెచ్చుకున్న ఇంటి యిల్లాలు.

ఆమె చదువు-సంస్కారం, భావుకత, సౌందర్యసౌకుమార్యాలు, అందచందాలు అన్నీ-అన్నీ-తనకే-తనకే స్వంతం...

ఇంకెవ్వరూ చూడకూడదు-అనేది అతని మనస్తత్వం. అయితే రుక్మిణికి తప్పించుకునే వీల్లేకపోయింది.

పదిహేను పదహారు సంవత్సరాలు కాపురం చేశాక కూడా పదహారు పందొమ్మిది మధ్య వున్నట్టుండే రుక్మిణి అన్నా, ఆమె తీయని గొంతు విన్నా ఛైర్మన్‌గారి భార్యకి అపురూపమైన ఆరాధన.

భూలోకానికి షికారొచ్చినట్లు ఎప్పుడూ తాజాగా వుండే రుక్మిణిలోని దైవత్వంలాటి లావణ్యం అంటే ఆమెకి ఆరాధన. అందుకే ఆమెని బలవంతం చేసింది. పరమశివం కాదనలేకపోయాడు.

వెళ్లేది అందరూ ఆడవాళ్లు.

వుండేది అంతా ఆడవాళ్లే!

పూల వనంలా బృందావనంలా వుండే స్త్రీల మధ్య తన భార్య పారిజాతంలా పరిమళించటం అతనికిమాత్రం అయిష్టమా!

అదిగో అలా వచ్చిందక్కడికి రుక్మిణి.

అందం వేరు ఆత్మ వేరు.

సౌందర్యం వేరు సౌకుమార్యం వేరు.

చదువొక తీరు సంస్కారం ఒక తెన్ను వచ్చిన ఆడవాళ్లు వచ్చిన పనే మర్చిపోయారు.

స్త్రీ సహజమైన ఈర్ష్యాసూయలు కోప తాపాల మధ్య చర్చనీయాంశం మరుగునపడిపోయింది.

ముగ్గురాడవాళ్లు కలిస్తేనే పట్టపగలు చుక్కలు రాల్తాయనుకుంటే మూడొందల మంది... వివిధ ప్రాంతాలు...మతాలు... భాషలు...సంస్కృతులు ఒకచో కలిస్తే! చదువు,

## విలువ

కాయానికి విలువ ఉంది
ప్రాయానికి విలువ ఉంది
మనోసీమ ప్రభవించే
గాయానికి విలువ లేదు
నయనాభ్రం వర్షించే
కన్నీటికి విలువ లేదు
మానవతా విపణిలోన
మగువా! నీ విలువ ఎంత?

—కనమలూరు వెంకటశివయ్య

సంస్కారం, సభ్యత ప్రవేణీ సంగమంలా వుండవలసిన చోటు వరదపోటున వుండే సప్త గోదావరంలా అయిపోయింది.

అన్నిటికి మించి రుక్మిణి ఆశించింది...

రఘు రసావిష్కరణాగమనం...

అయితే అతను రాలేదు...

రాక అవుతుందనుకున్న అతని రాక-అతను రాక నీరస నీరవ నిరీహ నిర్నిమేషమయిపోయింది.


అదిగో ఆస్పత్రిలో...

మూడు యుగాలు గడిపి, బ్రదుకు జీవుడా అనుకుంటూ గుండె నిండవలసిన వేళలో, రస పల్లవాలు చిగర్చవలసిన ఆమనిలో బ్రతుకు బరువును లాగే నిశీధిలా, ఆమనే లేని యామినిలా నిరాశా నిస్పృహలు నిండిన పేద గుండెతో-

ఒంటరిగా

జనసముద్ర మధ్యంలో...

***



కొందరు సూర్యదర్శనం చేసుకొందే భోజనం చేయరు. వర్షరుతువులో రెండు మూడు రోజులు ముసురు పట్టి ఎండ పొలకువే కనిపించదు. అయినా వాళ్లలాగే వుంటారు. అప్పుడెప్పుడో రవి కిరణసహితుడై...

అప్పుల్లో మునిగి తేలే మార్గమే కనిపించని దుర్భర మానసికావస్థలో లక్షల రూపాయలు లాటరీ రూపంలో భాగ్యలక్ష్మి...

అంతు తెలియని అందోళనా తిమిరంలో ఆత్మజ్యోతి ఒక్కసారిగా...

కనిపించినట్లు—

ఆ బస్టాండులో—

ఆ జనసమూహాన్ని చీల్చుకుంటూ

కోటి మంది లోనయినా తన ప్రత్యేక రూపు నిలుపుకునే రాఘవ...రఘు...అతని దర్శనం

రుక్మిణికి కనువిందైంది.

***

'ఈ గుండెమీద శయనిస్తే ఎంత చల్లగా వుంది రఘూ! ఇది నా హృదయ సింహాసనం లాగా, నా పట్టుపాన్పు లాగా నాకోసమే నువ్వు జన్మించావన్న మధుర భావన...'

'మినీ......'

జలతరంగిణిపై సప్తస్వరాల్లో రెండే రెండు అతి మనోమోహనంగా, కల్యాణావహంగా ఎదను మీటినట్లు వినిపించింది.

'రఘూ! మూడు రోజులు మూడు యుగాలుగా ఎదురుచూశాను. కళ్లు కాయలు కాచిపోయాయి. గుండె బరువు తగ్గిపోదు. ఎద లోపలి వేదన వెలుపడదు. చెప్పుకోటానికి నువ్వు లేవు.. బాధ పంచుకునేది కాదు-వెలువరించేదీ కాదు. ఎలా భరించానో!'

ఆమె అతని గుండెలపై కూర్చిన పూల చెండులా పడుకుని వుంది. పొందలేనిదేదో పొందగలిగిన తృప్తి కళ్లల్లో కాపురం పెట్టింది. రసమయ సంగీతం వింటూ పులకరించిపోతున్న భావన. మధుర మధుర మృదువీచికలకు పరవశిస్తున్న అనుభూతి.

అతనామె కురులు సవరించాడు

అతి నెమ్మదిగా వీపు నిమిరాడు

ఆ స్పర్శ ఓ పరుసవేది

ఆ అనునయం మనోనయన పర్వరసమయం

ఆ చేయి పది జన్మలకి సరిపడా తృప్తినిచ్చే హాయి సమకూర్చే రేయి.

అతనేమీ జవాబివ్వలేదు.

దేవీ సన్నిధానంలో మనో నేత్రాలకి నయనా

నందకరంగా దేవీ దర్శనం పొందిన ఏకాంత భక్త శిఖామణి మానసిక స్థాయిలో వున్నాడతను.

'నా ఉత్తరం అందలేదా!' .

అంద లేదన్నట్టుగా అతని చేయికదలాడింది.

'నువ్వొస్తావని-జీవితంలో అపూర్వంగా లభించిన యీ సువర్ణావకాశంలో మనకు ఏకాంతం లభిస్తుందని యీ మూడు రోజులూ మూడు మన్వంతరాలకి సరిపడా తాదాత్మ్యపొందవచ్చని గుండె గుడిగా చేసి ఆరాధించి, ఆరాధనార్చన లందుకోవచ్చని ఎంత ఆశపడ్డాను.

కోరిందేదీ కొంగు బంగారం కాదేమో!


కోర్కెల హరివిల్లు మనస్సులో విరుస్తుందే తప్ప జీవితంలో విరియదేమో!

కలలెప్పుడూ కల్లలుగానే వుండిపోయి ఫలించవేమో!

మరి అలాటప్పుడు-ఎందుకీ తపనలు? ఎందుకీ రసలాలన? ఏల యీ ఆవేదన? ఎందుకోసమీ ఆరాటం...గుండె గులాబీ దండై గుబాళించే దెందుకు?

'ఎందుకు? ఎందుకు రఘూ?'

అతనేం జవాబు చెప్పలేదు.




ఎక్కడో ఎదలోయల్లో కదలాడి ఎగసి ఎగసి, అలసి సొలసి కంటి మార్గాన కదిలి, ప్రిదిలి చెదరి జారిన కన్నీటి చుక్క...

ఆమె ఎక్కడ గమనిస్తోందన్న శంకతో—

అది ఒకచుక్కయి...జారి...ఆమెసిగలో... అతని మనస్సు అగరొత్తిగా మారి పొగలై సెగలై పూవైనట్టున్న ఒక గులాబీ విరిబాల దోసిట్లో జారిపడింది.

తిప్పిన శబ్దం కాలేదు.

బరువెక్కిన గుండె బాధతో నిట్టూర్చి మూగవోయింది.

'రఘూ! టైమెంతయింది?'

అతను జవాబివ్వలేదు.,

గడియారం చూసుకుంటే యిద్దర్నీ విడదీసేందుకు కాలంసెకన్లయి-నిమిషాలయి-గంటలయి ఎలా పరిగెడ్తోందో తెలుస్తుంది.

విడిపోవటానికి సమయం సమీపిస్తోందని గుర్తు చేస్తుంది.

తెలిసి తెలిసీ గుండెకెవరు గాలం గుచ్చుకుంటారు? ఎదకెవరు ఉరి వేసుకుంటారు?

అందుకే రాఘవ గడియారం చేతినుంచి తీసి టేబిల్‌పై పెట్టాడు.

'నాకు బస్‌టైం అవుతుందేమో!'

అతని నాభినుండి బయలుదేరిన దుఃఖ వీచిక గుండె దాకా వచ్చి గాఢంగా స్పృశించి గొంతుని తడిమి నులిమి నులిమి అక్కడే తానూ...

ఆమె తలెత్తి చూసింది.

బంగరు రంగులో ముద్దుమోము. గులాబీ వర్ణంలో చెక్కిళ్లు, ప్రేమ పరాగ రంజితమైన పెదాలు. వాటిపై తుమ్మెద రెక్కల్లాటమీసం.


# మీకు నచ్చే పుస్తకాలు

**దైవదర్శిని**:- జీవిత విజయాలకు, బాధలవిముక్తికి, దైవసాన్నిధ్యానికి, దైవాన్నిపొందిన అనేక సిద్ధులు తెల్పిన దైవరహస్యాలున్నాయి. దైవారాధకులు భక్తికిదగ్గ ప్రతిఫలం పొందటానికి తెలుసుకోవలసిన ఎన్నో ముఖ్య విషయాలిందున్నాయి. రూ.15.

**ఐదువైద్యవిధానాలు**:-420 రోగాలకురోగలక్షణాలు, వాటినివారణకు, అల్లోపతి, ఆయుర్వేద, హోమియో, చిట్కా, ప్రకృతి, డాక్టర్లు, వారివారివిధానాల్లో వివరించినమందులు, వాడేవిధానాలతో ఉన్నాయి. ఒకరోగానికి ఒకోవిధానంబాగాపనిచేస్తుంది. రూ.30.

**ఆహారవైద్యము**:-వివిధరోగాలకుకావలసినమందులన్నీ మనఆహారాల్లో సహజంగానేఉన్నాయి. ఏరోగానికి ఏఆహారం తిని నయంచేసుకోవాలో పరిశోధనలుచేసి నిపుణులుతెల్పిన వివరాలన్నీఉన్నాయి. ఇదిప్రకృతిసహజమైన వైద్యవిధానం. రూ.15.

**మూలికావైద్యము**:-ఇంట్లో దొరికే అల్లం, మిరియాలు, జీలకర్ర మొదలైనమూలికలతో వివిధరోగాలు నయంచేసుకొనే ఖర్చులేని ఎన్నోమంచిమార్గాలు. ఇవన్నీ పూర్వకాలంనుంచి చాలవాడుకలోఉన్నాయి. అన్నీబాగావివరించబడ్డాయి. రూ.15

**సేల్సుటాక్సు**:-ఆంధ్ర మరియు సెంట్రలు సేల్సుటాక్సు-చట్టాలు, రూల్సు, వివిధటాక్సురేట్లు, నేరాలు, పెనాల్టీలు, అప్పీళ్లు, మొదలైన సేల్సుటాక్సు విషయాలన్నీ పూర్తిగాఉన్నాయి. ప్రతివ్యాపారి వారిరక్షణకుతెలుసుకోవలసినవన్నీఉన్నాయి. రూ.25.

**ఇన్‌కంటాక్సు**:-రాబడిపన్ను, గిఫ్టుటాక్సు, వెల్తుటాక్సు, కేపిటలుగెయిన్సు, మొదలైనవాటి వివిధటాక్సురేట్లు, వాటిరాయితీలతో సహా ఇన్‌కంటాక్సునుగురించిన సర్వవిషయాలున్నాయి. సంపాదనపరులు, సంపన్నుల భద్రతకు తెలుసుకోదగ్గవన్నీఉన్నాయి. రూ.25.

**వ్యవహారదర్శిని**:-నిత్యవ్యవహారాలకు అనేకచట్టాలసూత్రాలవివరాలు, పిటీషన్లు, ఫిర్యాదులు, ధరఖాస్తులు, ఉత్తరాలు, దస్తావేజులు, ఎగ్రిమెంట్లు, వివిధపత్రాలు వ్రాసేవిధానాలు, వాటి అనేకనమూనాలతో ఉన్నాయి. వ్యవహారాలసామర్థ్యంబాగాయిస్తుంది. రు.15.

**మీస్వప్నఫలితాలు**:-జీవితంలోజరగబోయేవి కలలుగా వస్తాయి. ఇదిఅలాకన్పించేవాటి ఫలితాలుతెల్పేస్వప్నాల డిక్షనరీ. రూ.10.

**మానసికశక్తులు**:-హిప్నాటిజం, మెస్మరిజం, దివ్యదృష్టి, ఆత్మశక్తి, ఆకర్షణాశక్తి వీటివివరాలు, సాధనమార్గాలున్నాయి. రూ.10.

**రసికప్రియకథలు**:-పూర్వంనుంచీ పేరుగాంచినమంచికథలు. చదివినకొలదీ చదవాలనిపించే శృంగారహాస్యకథలు. రు.10.

**జీవితరహస్యాలు**:-సంసారజీవితాన్ని పరిపూర్ణఆనందదాయకం చేసుకోవటానికి తెలుసుకోదగ్గకామవిజయమార్గాలు. రు.10

**యువతి**:-యువతులు వారిదాంపత్యజీవితాన్ని తీర్చిదిద్దుకొని ఆనందమయంచేసుకోవటానికున్న అనేక మార్గాలు. రూ.10.

**సంతానము**:-సంసారసుఖాలు అనుభవించుచుకూడ, అవుసరంలేనపుడు గర్భనిరోధానికి అర్హవైన నవీన మార్గాలు. రూ.10.

**చేతిపనులు**:- స్వంతానికి లేక సంపాదనకు పనికొచ్చే ఎన్నోరకాలు సులభంగాచవుకగా ఇంట్లోచేసుకొనే మార్గాలు. రూ.10.

**మంత్రశక్తి**:- మంత్రాలంటె సంకల్పాలు. జపంతో ఆశయసిద్ధి వస్తుంది. అందుకు జపనియమాలు వివరించ బడ్డాయి. వెల రూ.10.

**అద్భుతహాస్యకథలు**:-ఆనందానికి హాస్యం మూలం. నవ్వటానికి, మిత్రులను నవ్వించటానికి ఎన్నోచిన్నచిన్నహాస్యకథలు. రూ.10.

ఇవన్నీ తెలుగుపుస్తకాలు. వీటిరచన ఎ:ఎస్.మూర్తి, యం.ఏ. చిన్నమొత్తానికి, పోష్టేజి, రూ.7 అదనం. రూ.40కి, ఆపైన పోష్టేజి ఉచితం.

దేశసేవప్రచురణాలు, నెం.2, ఇందిరానగరు, వెంగళరావునగరుపోష్టు, హైదరాబాదు-500890 వ్రాస్తే వి.పి. పోష్టులో పంపబడును.

ఆపై ప్రేమకాసారాల్లాటి, వలపు వాకిళ్లవంటి కనులు...

మకర సంక్రమణ వేశలో సూటిగా జారిన రవి కిరణంలాటి నాసిక. అందమైన నెన్నుదురు... ఆపై సెలయేటి నురగల్లాగ సాగర తరంగాల్లాగా తన మనసుదోచుకున్న ఉంగరాల ముంగురులు.

ఎంత సోయగం! ఏమందం?

ఈ అందం-దీన్నిమించిమానసిక సౌందర్యం.

ఇవే కదా తనని జన్మ జన్మల బందీచేసింది.

ఇలా కనులలో కనులు చేర్చి అలాగే తనవి తీరా జీవితాంతం చూస్తూవుండిపోవచ్చు ఎక్కడి ఆకలి...ఎక్కడి దాహం...తీరిసౌందర్య దాహం ముందు అవన్నీ గప్ చిప్...

నరాల్లో అలజడి వుండదు. నరాలహదారుల్లో ప్రేమ జలపాతాల నెమ్మదైన ప్రవహింపు..గుండె ఝల్లుమంటుందే కానీ గుబులుండదు. రక్తం శాంతంగా వెన్నెల తేరినట్లుంటుంది. అంతేకానీ హోరున పరిగెత్తదు...

ఎంత వింత అనుభూతి?

ఈ అనుభూతికి అద్దంపట్టే యీ అందమైన అనుభవం!

తను జీవితంలో యీ ప్రేమ-ఈ ప్రశాంతత- ఈ అనురాగమయ లోలత కోరుకుంది.

కానీ లభించిందేమిటి?

బరవెక్కబోయిన గుండె ఒక్కసారిగా-రాబోయే ఆ ఆలోచనా ప్రవాహాన్ని విదిల్చింది. విరిగిన కెరటం విసిరేసినట్లు ఆ చేదుఅనుభవాల ఆలోచ నలకి అక్కడే ఆనకట్ట.

'మినీ...'

'ప్రభూ!'

'ఈ ఏకాంతం లభిస్తుందని ఎన్నడూ అనుకోలేదు.'

'నే కలగన్నానా? యావజ్జీవ కారాగార శిక్ష పొందినా ఎప్పుడో విడుదల వుందికానీమనకు...'

'మనకూ ఓ సువర్ణావకాశం...'

'ఎప్పుడు?' ఆత్రుత ఆరాటం గుండెని గొంతుకలోకి తెచ్చాయి.

'బాధ్యతల నుంచి విడుదలయి—'

'అదెప్పుడో—'

'ఇంకెన్నేళ్లకయినా అవనీ-మినీ-నేనూ, నా భార్యా, నా పిల్లలు అనేది నాకు లేదు. అదేదో కార్యకారణ సంబంధం. తాళి కట్టినందుకు, కలసిన శరీరాలకు కలిమి లభించినందుకు వాళ్లకి సాంఘిక న్యాయం చేకూర్చాలి. చదువులు ఉద్యోగాలు పెళ్లిళ్లు యివి కొంత బరువును సడలిస్తే, ఆర్థికంగా బలం యిచ్చి కొడుకుల చెంత ఆమెని చేరిస్తే ఆపై నాకోసం కలవరించే ప్రాణికోసం నా జీవనయానం మొదలవుతుంది. కొన్నేళ్లో-కొన్నాళ్లో-వెన్నెల బయళ్లలో ప్రకృతి ఒడిలో-నీ ఒడిలో తృప్తిగా శయనిస్తాను...'

ఆమె అతని ఆరాధనకి, ఆశయాల అవధికి అభివందన చందనంగా అతని ఎదరొమ్ముపై వాలిపోయింది.

అతనామెని పూలహారంలా స్పృశించాడు.

'మరి...నేను...'

'నీవు అంతే... కూతుర్ని అత్తింటికిపొగనంపి, కోడలికి పెత్తనం అప్పగించి...ఆపై...ఆపయిన అతను పూర్తిచేయలేదు.

'లోకం ఒప్పుకుంటుందా?'

'అప్పుడు-ఆ నాల్గుపదుల నడిమి వయసులో యింకా లోకాన్ని లెక్కించాలా?'

'కానీ-కాకుల్లా కూస్తారు...'

'వినిపించని విహాయసవీధి హద్దుగా ఎచటికో ఏ దూరతీరాలకో ఏ నదీగర్భంలోవున్న యిసుక తిన్నెల బయళ్లకో-వెళ్లిపోదాం...'

ఆమె మదిలో ఏదో దృఢనిర్ణయం.

'రఘూ!'

'మినీ!'

అతని అరటి మొగ్గలాటి అరచేతిలో అరవిందంకంటే మృదువైన తన చేయి వేసింది.

'ప్రామిస్!'

'ప్రామిస్!'

'మళ్లీ యిలా కలుసుకునే యోగమ్ముంటుందో వుండదో-ఎప్పుడో ఎన్నడో అవకాశం లభిస్తుందని ఆశే ఆధారంగా జీవిక సాగిస్తున్నాను. నీకు ట్రాన్స్‌ఫర్ అయిఅక్కడికొమళీవస్తే..రోజుకో... వారానికో... నెలకో-సంవత్సరానిలో-ఎప్పుడో-ఏదో బజార్లోనో-హోటల్‌లోనో, సినిమా హాల్‌లోనో, ఏదైనా ఫంక్షన్‌లోనో, దసరాకో, ఉగాదికో నిన్ను దేవునిలా చూస్తానని ఆశ వుంటుంది. కానీ నీకు బదిలీ రాదు. నా కోరిక తీరదు-'

క్షణ క్షణానికి బరువెక్కుడోంది కంఠం.

దుఃఖోద్విగ్న మానసం...

స్వాంతన లభించేట్టుగా ఆమె వెన్నుపైఅతని చేయి...

ఆమె శాంతించింది.

'అందుకే యిప్పుడే నా గుండె విప్పతున్నా...ఈ బరువూ బాధ్యతలు తీరగానే... ఒక్క క్షణ విలంబనమయినా యిపొద ఓర్చుకోదు. నీకు ఎక్స్‌ప్రెస్ టెలిగ్రాం యిచ్చేసి రైలెక్కేస్తా... నువ్వు ఆపై నాతోడుగా... జోడుగా...నీడగా... అండగా...'

'బతుకు పున్నమిలో రాకాశశి ఉదయించే ఆ వేళకై కలువలా......'

'మళ్లీ కలుసుకుంటామనే ఆశ...ఇప్పుడు విడిపోతున్నామనే దుర్భర వియోగవ్యధ..ఎంత సంఘర్షణ...'

'నీకై నిరీక్షిస్తూ...ఆ క్షణాలకై వీక్షిస్తూ... అంతదాకా ఆశగా జీవిస్తూ...నయనాభిరామవై నా జీవన రాగానివై రసపల్లవంగా హోస వెల్లువగా వస్తావని......'

ఆమె పాదాలు మృదువుగా...ప్రేమగా... ఆరాధనా పూర్వకంగా రెండు చేతులతో....

